క్లుప్తంగా

విద్యార్థులకు పరుగు పందెం రేపు

సీతంపేట: నేషనల్ స్పోర్ట్స్‌డేను పురస్కరించుకుని ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు ఈ నెల 29న పాలకొండ నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరుగుపందెం నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, జెడ్పీ, కేజీబీవీ తదితర ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు పాఠశాలకు ఇద్దరు చొప్పున హాజరు కావాలన్నారు. గురువారం ఉదయం 6 గంటలకు స్టడీ షర్టిఫికెట్లు తీసుకుని రావాలన్నారు.

పట్టణానికి దూరంగా పందులను ఉంచాలి

పాలకొండ: పట్టణంలో పందుల సంచారంపై చర్యలు తీసుకుంటామని నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు మంగళవారం తెలిపారు. పురపాలక శాఖ మంత్రి ఆదేశాల మేరకు పందుల పెంపకందారులు పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో పందుల ఆవాసాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో పశువులను ఉంచడంపై చర్యలు తీసుకునేందుకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు వస్తున్న నేపథ్యంలో నిబంధనలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వచ్చే నెల 10 నుంచి దీనిని అమలు చేస్తామని, ఈలోగా వీటి పెంపకం దారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. లేకుంటే పందులను, పశువులను పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెడతామని హెచ్చరించారు.

కీసరజోడులో పొలం పిలుస్తోంది..

సీతంపేట: మండలంలోని కీసరజోడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పత్తిలో అంతర పంటగా బంతి వేయడానికి వీలుగా బంతి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ద్రవామృతం తయారీ వివరించారు. కందిలో తీసుకోవాల్సిన సస్యరక్షణపై వ్యవసాయాధికారి శ్రీదేవి పలు సూచనలు చేసారు.

వివాహిత అదృశ్యం

వీరఘట్టం: మండలంలోని బిటివాడ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యం అయినట్లు ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ జి.కృష్ణంనాయుడు మంగళవారం తెలిపారు. ఈమెకు నాలుగు నెలల కిందట సంతకవిటి మండలానికి చెందిన ఓ అబ్బాయితో వివాహం జరిగిందని, మూడు నెలల క్రితం ఆషాడంలో పుట్టింటికి మీనాక్షి వచ్చిందన్నారు. ఈ నెల 23న ఇంటిలో ఎవరూ లేని సమయంలో మీనాక్షి వండవ సెంటర్‌లో ఆటో ఎక్కి వీరఘట్టం వైపు వెళ్తున్నట్లు బంధువుల అమ్మాయి చెప్పడంతో గత నాలుగు రోజులుగా ఆమె కోసం అన్ని చోట్ల గాలించినట్లు తెలిపారు. ఎక్కడా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

రేగిడి: సేంద్రియ ఎరువులు వినియోగించి పంటలు పండిస్తే అధిక దిగుబడులు వస్తాయని సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ కేస్ రమేష్ అన్నారు. మండలంలోని గుల్లపాడు గ్రామంలో జీవామృతం తయారీపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఎల్2 గౌరీశ్వరరావు తొలుత జీవామృతం తయారీని ప్రయోగాత్మకంగా వివరించి, దాని ప్రయోజనాలు తెలిపారు. రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులను వినియోగిస్తే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ చెరకు పంట సాగులో కూడా సేంద్రియ ఎరువులు వినియోగిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో చక్కెర కర్మాగారం ఫీల్డ్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, ఎల్2 సురేష్, ఐసీఆర్‌పీలు తవిటినాయుడు, గోవిందమ్మ, శ్రీలత, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మిక సంఘ సమావేశం

బొబ్బిలి: స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం బొబ్బిలి, పార్వతీపురం బ్రాంచ్‌ల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. బొబ్బిలి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఆదిలక్ష్మి, యు.శ్రీనివాసరావు, పార్వతీపురం అధ్యక్ష, కార్యదర్శులు పి.భాస్కరరావు, కె.రాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రీజనల్ అధ్యక్షుడు బి.తేజేశ్వరరావు, సెక్రటరీ కె.జయరాజు, సభ్యులు పాల్గొని, సంఘ సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. బదిలీల్లో ఏ ఒక్క కార్మికుడికీ అన్యాయం జరగనీయకుండా సంఘ కార్యవర్గం పనిచేస్తుందన్నారు.

ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోండి

రేగిడి: ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ కోరారు. మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని, ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

వీరఘట్టం:

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుంబిడి - ఇచ్చాపురం గ్రామ పంచాయతీలో మంగళవారం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గిరిజన రైతులకు పలు సూచనలు చేసారు. ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో ఆరోగ్య కరమైన పంటలు పండించవచ్చునని, చీడ పీడల నివారణకు జీవామృతం, ఘనామృతంతో నివారించవచ్చునని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు రైతులు ఆర్జించవచ్చునని సూచించారు. గ్రామ సర్పంచ్ బిడ్డిక గౌరునాయుడు, వ్యవసాయ శాఖ ఏడీఏ కె.రత్నకుమారి, ఏఓ జె.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



జీవామృతం తయారు చేసి చూపిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

5 హెక్టార్లలో మొక్కల పెంపకం

గుమ్మలక్ష్మీపురం: అడవుల సంరక్షణలో భాగంగా గుమ్మలక్ష్మీపురం అటవీ శాఖ సెక్షన్ పరిధిలోని ఎస్.కె.పాడు గ్రామ సమీపంలో 5 హెక్టార్లలో మొక్కలు పెంచుతున్నట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ఎస్.రామారావు, తిరుమలరావు, నీలామణి తెలిపారు. ఈమేరకు మంగళవారం ప్లాంటేషన్లను పరిశీలించారు. 5 హెక్టార్ల అటవీ భూమిలో 3 హెక్టార్లలో టేకు మొక్కలు, మరో 2 హెక్టార్లలో మిశ్రమ జాతి మొక్కలైన వేప, నేరేడు, తెల్ల ఇరిడి, ఉసిరి తదితర మొక్కలను ఎఫ్‌ఆర్‌ఓ మణికంటేశ్వరరావు ఆధ్వర్యంలో నాటినట్లు చెప్పారు.



ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న బీట్ ఆఫీసర్లు

జేసీ ఆదేశాలతో సమస్యకు చెక్



కాట్రగడ పిల్ల కాలువ బాగు చేస్తున్న వేతనదారులు

భామిని: పార్వతీపురం మన్యం జిల్లా జేసీ కె.శోభిక జోక్యంతో రైతు వరద సమస్యకు మంగళవారం చెక్ పడింది. ఈ నెల 23న భామిని మండలం కాట్రగడ బీ ఓపెన్ హెడ్ చానల్ చూసేందుకు వచ్చిన జేసీకి కాట్రగడ బీ రైతులు తమ పొలాలు ముంపునకు గురవుతున్నట్టు తెలిపారు.

వంశధార వరద కాలువ కింద నిర్మించిన అండర్ పాసేజ్ మూత పడడంతో ముంపు సమస్య నెలకొందన్నారు. వెంటనే జేసీ మండల అధికారులను ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, ఉపాధి ఏపీఓ తులసీదాస్ సంయుక్తంగా పొలాల్లోని వరద నీరు పారేందుకు చిన్న కాలువ బాగు చేయించి వరద నీటి బాధ తొలగించారు. జేసీబీతో వరద గట్టు మట్టిని తొలగించారు. రైతుల సమస్యకు చెక్ పెట్టారు.

పంట తెగుళ్లపై అప్రమత్తం

గుమ్మలక్ష్మీపురం: వరిలో ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ అన్నారు. మండలంలోని గొయిపాక, బీరుపాడు గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పుల కారణంగా తెగుళ్లు ఆశించే అవకాశం ఉందన్నారు. కావున వ్యవసాయ సిబ్బంది సూచనల మేరకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పొలం గట్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించడం వల్ల అధిక ప్రయోజనాలు ఉంటాయన్నారు.అనంతరం ఈ-పంట నమోదును పరిశీలించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి ప్రసాద్

సాహితీవేత్తకు నివాళి

జియ్యమ్మవలస: ప్రముఖ సాహితీవేత్త, చరిత్ర పరిశోధకుడు, ప్రజా పక్షపాతి, ప్రజల కోసమే తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు ఆచార్య డాక్టర్ ముత్యం అకాల మరణానికి విచారణ వ్యక్తం చేస్తూ ఆయన సంస్మరణ సభను మేరంగి నాటకపరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం పెదమేరంగిలో నిర్వహించారు. నాటక పరిషత్ అధ్యక్షుడు రౌతు వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పరిషత్ ప్రధాన కార్యదర్శి విజయకుమార్, కార్యదర్శి అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు బలగ వెంకటరమణ, వెలగాడ అన్నపూర్ణమ్మ హాజరయ్యారు. వక్తలు ముత్యం జీవిత చరిత్రను వివరించారు. అనంతరం రెండు నిముషాలు మౌనం పాటించి ముత్యం మృతికి సంతాపం తెలియజేశారు.



నివాళులర్పిస్తున్న మేరంగి నాటకపరిషత్ అధ్యక్షుడు, సభ్యులు

చీడపీడల నివారణకు సూచనలు

భామిని: వరి పంటలో వచ్చే ఆకు ముడత, పొడ తెగులు, అగ్గి తెగులు గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం సూచించారు. ఘనసరలో మంగళవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులకు పలు సూచనలు చేశారు. తెగుళ్లు సోకిన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వీఏఏ, రైతులు పాల్గొన్నారు.



వరి చేనులో తెగులు పరిశీలిస్తున్న రైతులు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రామభద్రపురం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి సూచించారు. మండలంలోని బూసాయవలస గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో మంగళవారం సమావేశమైన ఆమె.. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. కేంద్రాల ద్వారా ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా లబ్ధిదారులకు అందజేయాలన్నారు. పోర్టిఫైడ్ బియ్యాన్ని ఆహారంగా తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత తగ్గి, ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి

లంపీస్కిన్ వ్యాధి బారిన పశువులు

వంగర:

మండలంలోని ఇరువాడ పంచాయతీ, చంద్రంపేట గ్రామంలోని పశువులు లంపీస్కిన్ వ్యాధి బారిన పడుతున్నాయి. గత 10 రోజులుగా పశువులకు ఈ వ్యాధి ఎక్కువైందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన తెర్లి జగ్గనాయుడు, అయ్యల స్వామియాజులు, లక్ష్మీనరసింహమూర్తి, పెద్దింటి వెంకటనాయుడు, వంగపండు వెంకటనాయుడు, నాగళ్ల లక్షుంతో పాటు మరి కొంతమంది రైతులకు చెందిన పశువులు ఈ వ్యాధితో ప్రస్తుతం బాధపడుతున్నాయి. పశువుల శరీరంపై చిన్నపాటి పొక్కులు ఏర్పడి, అవి తర్వాత పుండ్లుగా మారుతున్నాయని సంబంధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పశు వైద్యసేవలు అంతగా అందడం లేదని, అధికారులు స్పందించి పశువైద్య సేవలందించాలని కోరుతున్నారు.



లంపీస్కిన్ వ్యాధి సోకిన లేగదూడలు

పుస్తకావిష్కరణ రేపు

రాజాం: పట్టణంలోని సూర్యదుర్గా కల్యాణ మండపంలో పొనుగుటివలసకు చెందిన శాసపు రామినాయుడు(వెలుగు రామినాయుడు) రాసిన పొలమారిన ఊరు అనే కవితాసంపుటి పుస్తకాన్ని ఈ నెల 29వ తేదీన ఆవిష్కరించనున్నారు. సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజాం రోటరీ సంస్థ సభ్యుడు మక్క అప్పలనాయుడు విచ్చేసి, పుస్తకాన్ని విడుదల చేయనున్నారన్నారని రాజాం వెలుగు సంస్థ సభ్యులు పేర్కొన్నారు. సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు, కవులు, రచయితలంతా హాజరుకావాలని కోరారు.

నేడు 'విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక'

రామభద్రపురం: బొబ్బిలి విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఈ శశిభూషణరావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. రామభద్రపురం, తెర్లాం, బాడంగి మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులంతా హాజరై, తమ సమస్యలు తెలియజేయాలని కోరారు.

ఇసుక లారీ సీజ్

సంతకవిటి: మండల పరిధిలోని పోతులజగ్గుపేట వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు ఏఎస్ఐ వాసుదేవరావు మంగళవారం వెల్లడించారు. పోడలి వద్ద ఉన్న నాగావళి నదీతీరం నుంచి ఇసుకను లోడ్ చేసుకుని వస్తుండగా, పట్టుకుని, విశాఖపట్నం జిల్లాలోని పద్మనాభపురానికి చెందిన లారీ డ్రైవరు కోరాడ శ్రీనువాసరావు, లారీ ఓనరు పూసర్ల రమణలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


వాహన తనిఖీలు

వంగర: మండలంలోని మద్దువలస జంక్షన్ వద్ద ఎస్ఐ షేక్ శంకర్ తన సిబ్బందితో కలిసి మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు లేని వారిని పట్టుకుని, అపరాద రుసుం విధించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, వాహనంతో బయటకు వచ్చేటప్పుడు లైసెన్స్‌తో పాటు వాహన ధ్రువపత్రాలన్నీ వెంట తీసుకురావాలని వాహనదారులకు సూచించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని, మద్యం తాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని తెలిపారు.

వితరణ

రామభద్రపురం: మండలంలోని ఇట్లామామిడిపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన వారణాసి నాగేంద్రబాబు విద్యాసామగ్రి వితరణ చేశారు. ఆయన తన కూతురు హార్థికరామ పుట్టినరోజు సందర్భంగా రూ.20 వేలతో సమకూర్చిన పెన్నులు, నోటుపుస్తకాలు, పాఠశాలకు అవసరమైన మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయుడు తెంటు సత్యనారాయణకు మంగళవారం అందజేశారు. ఇదే పాఠశాలలో చదువుకున్న తాను ఇదే పాఠశాలలో చదివే విద్యార్థులకు తనవంతు సాయం చేయడం చాలా ఆనందంగా ఉందని నాగేంద్రబాబు అన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న చెస్ అసోసియేషన్ సభ్యులు

బొబ్బిలి: రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు స్థానిక పట్టణానికి చెందిన విద్యార్థి రాంబార్కి హేమ నాగహర్షిత్ ఎంపికైనట్లు చెస్ అసోసియేషన్ విజయనగరం జిల్లా సంయుక్త కార్యదర్శి మూడడ్ల గణేష్‌నాయుడు తెలిపారు. ఇటీవల విజయనగరం జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో సదరు విద్యార్థి విశేష ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. సెప్టెంబరు 21, 22వ తేదీల్లో జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

పూర్ణపాడు వంతెన పూర్తిచేయాలి

కొమరాడ: నాగవళి నదిపై అసంపూర్ణంగా ఉన్న పూర్ణపాడు-లాబేస్ వంతెన పనులు వెంటనే ప్రారంభించాలని సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి కోరారు. ఈ మేరకు పూర్ణపాడు వంతెన వద్ద పలువురు పడవ ప్రయాణికులతో కలిసి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగవళి నదిపై వంతెన పనులు 2006 ప్రారంభించి నేటికీ పూర్తి కాలేదన్నారు. పడవ ప్రయాణంలో ఎంతో మంది గిరిజనులు ప్రాణాలు కోల్పోయారని, ప్రభుత్వాలు మారినా వంతెన పూర్తిచేయకపోవడం శోచనీయం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వంతెన పనులు ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.



పడవ ప్రయాణికులతో కలిసి నిరసన తెలియజేస్తున్న సాంబమూర్తి

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.కె.సాగర్‌వర్మ అన్నారు. మండలంలోని గొట్టివలసలో మంగళవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో కలుషిత తాగునీరు, ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గొట్టివలసలో నిర్వహించిన వైద్యశిబిరం

జీఓ 117ను రద్దు చేయాలి

వీరఘట్టం: విద్యా ప్రమాణాలు మెరుగుకు అడ్డంకిగా ఉన్న జీఓ 117ను రద్దు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరపు సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్, నీలానగరం, తెట్టంగి, బిటివాడ, వండవ, కత్తులకవిటి, సంత-నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన మంగళవారం సందర్శించారు. జీఓ 117 వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మధ్యంతర భృతి ప్రకటించాలని, నూతన వేతన సవరణ సంఘాన్ని నియమించాలని, వేతన సవరణ బకాయిలు చెల్లించాలని, కరువు భత్యం బకాయిలు విడుదల చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఆయనతో పాటు సంఘ నాయకులు కాగాన విజయ్, కె.పోలినాయుడు, కె.విజయకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు సూర్యనారాయణ

హెల్మెట్‌తోనే సురక్షిత ప్రయాణం

గరుగుబిల్లి: ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని స్థానిక ఎస్ఐ పి.రమేష్ నాయుడు అన్నారు. మండలంలోని ఎర్రన్నగుడి జంక్షన్ వద్ద మంగళవారం పలువురు వాహన చోదకులకు హెల్మట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ధ్రువపత్రాలు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. హెల్మట్ ధరించకపోవడంతో రహదారి ప్రమాదాల్లో అనేక మంది మృతిచెందుతున్నారని, ఆ కుటుంబాల్లో విషాదం నింపుతున్నారని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



హెల్మెట్ ఆవశ్యకతను వివరిస్తున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

నేత్ర రోగులకు వైద్య పరీక్షలు

పాలకొండ: స్థానిక సత్యసాయి మందిరం ఆవరణలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. 139 మందికి పరీక్షలు నిర్వహించి 39 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అంతకు ముందు శిబిరాన్ని సత్యసాయి రాష్ట్ర ఐటీ ఆర్.కిశోర్ ప్రారంభించారు. సత్యసాయి మందిర కన్వీనర్ కె.సుధాకర్, సూర్యారావు, శంకర్ ఫౌండేషన్ వైద్యులు రత్నంరాజు, ఎస్.అప్పలరాజు, ఎం.సాయికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అర్ధరాత్రి వరకు పూజలు

భామిని: మండలంలోని లివిరి గోపినాధ రాధాకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం అర్ధరాత్రి వరకు నిర్వహించారు. సుందరంగా అలంకరించిన పూల ఊయలలో చిన్నికృష్ణుని ఉత్సవ విగ్రహాలు వేసి రాత్రంతా భక్తులు ఊయల ఊపుతూ భక్తి గీతాలు ఆలపించారు. ఉత్కళ సాంప్రదాయం ప్రకారం శ్రీకృష్ణుని జనన సమయమైన అర్ధరాత్రి వేళ జన్మాష్టమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. రాధాకృష్ణుల మూలవిరాట్‌లకు రకరకాల నైవేద్యాలను సమర్పించి పూజలు చేశారు. ఒడిశా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కృష్ణాష్టమి వేడుకలు

పాలకొండ రూరల్: శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలు పట్టణంలోని కోమటిపేట రాధాకృష్ణ ఆలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అజిత్‌పాడి నేతృత్వంలో రాధాకృష్ణులకు ఇతివృత్తాంత గీతాపారాయణం చేపట్టారు పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను రాధాకృష్ణులుగా అలంకరించి సందడి చేశారు.



చిన్నికృష్ణుని ఊయల ఊపుతున్న భక్తులు

నేడు ప్రజావేదిక

పాలకొండ రూరల్: 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించి మండల పరిధిలో 32 పంచాయతీల్లో జరిగిన పనులకుగాను ప్రజా వేదిక బుధవారం జరగనున్నట్టు ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు 17 సామాజిక తనిఖీలకు సంబంధించి ఈ ప్రజా వేదిక చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో పాటు మండల పరిధిలో ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్టు పేర్కొన్నారు.

ప్రజావేదిక రేపు

వీరఘట్టం: మండలంలోని 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులపై, ఈ ఏడాది జనవరి నుండి జూన్ వరకు పంపిణీ చేసిన 10,109 సామాజిక పింఛన్లపై ఇటీవల చేపట్టిన సోషల్ ఆడిట్ మంగళవారంతో ముగిసిందని ఏపీఓ జి.సత్యంనాయుడు మంగళవారం తెలిపారు. ఈ సోషల్ ఆడిట్‌పై ఈ నెల 29న మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం, ఐటీడీఏ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో రూ.21.28 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. పనుల్లో నాణ్యత, చేసిన ఖర్చులు తదితర అంశాలపై ఎస్ఆర్‌పీ డి.దాసు ఆధ్వర్యంలో గత 20 రోజులుగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజావేదికలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు

చెత్తతో దుర్గంధం

పాలకొండ: నగర పంచాయతీ కార్యాలయం ఎదురుగా వేస్తున్న చెత్తతో దుర్గంధం వెదజల్లి భరించలేకపోతున్నామని ప్రజా సంఘాల నాయకుడు దావాల రమణారావు తెలిపారు. చెత్తను తొలగించాలని కోరుతూ నగర పంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయం వద్ద చెత్తను డంప్ చేస్తున్నారని, దీంతో మార్కెట్ మొత్తం దుర్గంధం భరించలేకపోతున్నామని తెలిపారు. కార్యాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పట్టణంలో సేకరించిన చెత్తను కార్యాలయం ముందు వేయడం దురదృష్టకరమన్నారు. తక్షణం చెత్తను ఇక్కడ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలతో కలసి చెత్తపై సమరం చేస్తామన్నారు. అనంతరం నగర పంచాయతీ మేనేజర్ జయరాంకు వినతిపత్రం అందజేశారు.



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పౌర సంఘాల ఐక్యవేదిక నాయకులు